
సాక్షి పల్నాడు

శనివారం | 19 | ఆగస్టు | 2023

I



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు.




పసుపు కొమ్ముల అలంకారం

పెదకాకాని : భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకొని అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు

పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా.. అభయ ప్రదాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపించారు.



న్యూస్‌రీల్

అమరేశ్వరునికి 32.53 లక్షల హుండీ ఆదాయం



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లీలావతి సమక్షంలో 12 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును భక్తులతో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథ శర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం మొత్తం రూ.30,88,133, అలాగే అన్నదాన మండపంలోని హుండీల ద్వారా రూ.1,64,953 వచ్చినట్లు తెలిపారు. అలాగే 206 గ్రాముల వెండి, 5 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారం హుండీ ద్వారా భక్తులు అమరేశ్వరునికి సమర్పించినట్లు తెలిపారు. ఈ నగదు మొత్తాన్ని బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు.

నేడు సర్పంచ్, ఏడు వార్డుస్థానాలకు ఎన్నికలు

గుంటూరు వెస్ట్ : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వివిధ కారణాలతో ఖాళీ అయిన సర్పంచ్, ఏడుగురు వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణ జిల్లా పంచాయతీ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం జరగనున్న ఈ ఎన్నికల్లో తెనాలి మండలం బుర్రిపాలెం సర్పంచ్ పదవికి ఐదుగురు పోటీ చేస్తున్నారు. చేబ్రోలు మండలం గుండవరం, తోటిపాలెం, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంట పాలెం, రావిపాడు, వరగానిలలో మొత్తం 7 వార్డు మెంబర్లకు 15 మంది పోటీ పడుతున్నారు. నేటి సాయంత్రానికి ఫలితాలు కూడా ప్రకటిస్తారు.

మల్లేశ్వరస్వామి దర్శనం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయానికి దేవదాయ శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ టి.చంద్రకుమార్ దంపతులు విచ్చేశారు. వారికి సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అదనపు కమిషనర్ దంపతులు స్వామిని దర్శించుకుని అభిషేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి శేష వస్త్రంతో ఆదనపు కమిషనర్‌ను సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో చంద్రకుమార్ దంపతులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో శాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వీఆర్‌లోకి 'ఆ ముగ్గురు'

సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'ఆ పోలీసుల తీరే వేరు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పదన లభించింది. సివిల్ పంచాయతీలో తలదూర్చటంతో సహా పనితీరుపైనా విమర్శలు రావడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ, కానిస్టేబుల్, త్రీటౌన్‌కు చెందిన మరో కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు సమాచారం. ఆ ముగ్గురిని వీఆర్‌లోకి పంపారు. ఆ ప్రకారం వారికి శుక్రవారం సాయంత్రం పాస్‌పోర్టునిచ్చి పంపినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

గుంటూరు డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ మీదుగా పలు పనులు చేపట్టిన నేపథ్యంలో డివిజన్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 17299.. గుంటూరు- విశాఖపట్నం శనివారం నుంచి 21 వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు. విశాఖపట్నం-గుంటూరు(17240) ఈనెల 20 నుంచి 22 వరకు, గుంటూరు-నర్సాపూర్(17281) రైలు శనివారం నుంచి 21 వరకు, నర్సాపూర్-గుంటూరు(17282) శనివారం నుంచి 22 వరకు, గుంటూరు- డోన్(17228) రైలు శనివారం నుంచి 21వ తేదీ వరకు, డోన్- గుంటూరు(17227) మీదుగా ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు, నర్సాపూర్- గుంటూరు (07281) రైలును శనివారం నుంచి 21వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించారు.

వేళంగణికి ప్రత్యేక రైలు..

సికింద్రబాద్- వేళంగణి(07161) ఈనెల 27, 29 తేదీలలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు గుంటూరు డివిజన్ మీదుగా కేటాయించినట్లు తెలిపారు. వేళంగణి-సికింద్రబాద్ (07162) రైలు ఈనెల 29, 31వ తేదీలలో ప్రత్యేక రైలును నడపనున్నట్టు వివరించారు.

అమృత ఘడియలు

- పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- రూపురేఖల మార్పునకు చర్యలు
- రూ.19.33 కోట్లతో పనులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌కు అమృత ఘడియలు రాబోతున్నాయి. ఆధునికీకరణకు సంసిద్ధమవుతోంది. స్టేషన్ సుందరీకరణకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. దీనిలోభాగంగా ఈనెల 6న వర్చ్యువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల నుంచి పాల్గొన్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని శిలాఫలకం ఆవిష్కరించారు.



ఆధునికీకరణ తర్వాత పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ ఊహా చిత్రం

ఎంపీ, ఎమ్మెల్యే కృషితోనే..

పిడుగురాళ్ల స్టేషన్ ఆధునికీకరణకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి విశేష కృషి చేశారు. ఫలితంగా స్టేషన్ ఆధునికీకరణకు కేంద్రం అమృత్ భారత్ పథకం ద్వారా చర్యలు చేపట్టింది. దీని కోసం రూ.19.33 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. పనుల ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.

40 రైళ్ల రాకపోకలు

పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ మీదుగా ప్రస్తుతం రోజూ 40 రైళ్ల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు, హౌరా నుంచి చెన్నై, సికింద్రాబాద్ నుంచి తిరుపతి వంటి పలు రైళ్లు పిడుగురాళ్ల స్టేషన్ మీదుగా వెళ్తుంటాయి. సుమారు రెండువేల మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తారు. రిజర్వేషన్ కౌంటర్ సౌకర్యం ఉంది. రోజుకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



ఈనెల 6న శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఆధునికీకరణలో చేపట్టే పనులివే..

- పాత భవనాన్ని కూల్చి రెండు వైపులా 76.3 మీటర్ల పొడవు, 11 మీటర్ల వెడ్పుతో జీ + 1 భవన నిర్మాణం
- ప్రయాణికుల కోసం వీఐపీ, సెకండ్ క్లాస్, జనరల్ వెయింటింగ్ గదులు, పైభాగంలో వస్తువులు భద్రపరుచుకునే గది ఏర్పాటు
- ఫుడ్‌స్టాల్ల కోసం ప్రత్యేక గదులు
- పలు బ్యాంక్‌ల ఏటీఎంల ఏర్పాటుకు అవసరమైన చర్యలు
- 1వ నెంబర్ ప్లాట్‌ఫాం చివరి వరకు పైకప్పు పొడిగింపు
- మినరల్ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్ల నిర్మాణం
- 1,2, ప్లాట్‌ఫారాల్లో లిఫ్ట్ సౌకర్యం
- స్టేషన్ ప్రాంగణంలో గార్డెనింగ్
- ఆకర్షణీయంగా రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆధునికీకరణ

మోడ్రన్ రైల్వేస్టేషన్ సాకారం



పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ. 19.33 కోట్లు మంజూరు చేసింది. స్టేషన్‌ను అత్యాధునికంగా మోడ్రన్‌గా తీర్చిదిద్దబోతున్నాం. నాణ్యతతో పనులను చేపడతాం. ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణాలు చేపట్టబోతున్నాం.

– ఎ.రామకృష్ణ, రైల్వే డీఆర్‌ఎం, గుంటూరు

శుభపరిణామం



పిడుగురాళ్ల రైల్వేస్టేషన్ అభివృద్ధి జరిగితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ఇది శుభపరిణామం. గతంలో తాము స్టేషన్ అభివృద్ధి కోసం వినతులు ఇచ్చాం. స్టేషన్ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఆనందంగా ఉంది.

– జూలకంటి శ్రీనివాసరావు, సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్, పిడుగురాళ్ల

పంచాయతీ ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడు 14 వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్
- అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన అధికార యంత్రాంగం

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. తాజాగా రెండు సర్పంచ్ స్థానాలకు, 48 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో రొంపిచర్ల మండలం రామిరెడ్డిపాలెం, క్రోసూరు మండలం పెరికిపాడు పంచాయతీలకు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మరో 33 వార్డు మెంబర్ స్థానాలు ఏకగ్రీవం కాగా, ఒక వార్డు మెంబర్ స్థానానికి అభ్యర్థులు ఎవరూ పోటీ లేకపోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. కాగా మిగిలిన 14వ వార్డు మెంబర్ స్థానాలకు శనివారం పోలింగ్ జరగనుంది. ఈ 14 స్థానాల్లో మొత్తం 30 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరగనుంది. ఆయా స్థానాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి, పూర్తి కాగానే ఫలితాలను ప్రకటించనున్నారు. పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను పంచాయతీ అధికారులు చేపట్టారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాట్లను చేశారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144వ సెక్షన్ అమలు చేశారు,

రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్ల మృతి

పిడుగురాళ్ల: నోట్ పుస్తకాల కొనుగోలుకు వెళ్లిన తండ్రీకూతుళ్లు ద్విచక్రవాహనంపై సంతోషంగా ఇంటికి తిరిగి వస్తుండగా ఆగి ఉన్న లారీ రూపంలో దారి కాచిన మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. ఈ హృదయ విదారక ఘటన శుక్రవారం రాత్రి పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి సమీపంలోని శ్రీనివాస్‌నగర్ వద్ద జరిగింది.

పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ సమీపంలోని అయ్యప్పనగర్‌కు చెందిన యెనుముల నరసింహారావు(39)కు భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఇటీవలే పెద్ద కుమార్తెకు పెళ్లిచేశాడు. రెండో కుమార్తె శ్రీనిధి (17) పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెకు నోట్ పుస్తకాల కొనుగోలు కోసం శుక్రవారం సాయంత్రం బ్రాహ్మణపల్లికి వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో శ్రీనివాస్ నగర్ వద్ద రోడ్డు పక్కనే ఆగిఉన్న లారీని గమనించకుండా ఢీకొట్టారు. దీంతో నరసింహారావు, శ్రీనిధి తలలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో మరణించిన యెనుముల నరసింహారావు, శ్రీనిధి

మార్గదర్శి బ్రాంచిల్లో రెండో రోజు కొనసాగిన సీఐడీ తనిఖీలు

నగరంపాలెం: మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్ కార్యాలయాల్లో రెండో రోజు సీఐడీ విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని గుంటూరు అరండల్ పేట, తెనాలి, పల్నాడు జిల్లా నరసరావుపేట, బాపట్ల, చీరాలలోని బ్రాంచి కార్యాలయాల్లో గురువారం ప్రభుత్వ శాఖలు సంయుక్తంగా సోదాలు చేపట్టిన విషయం విదితమే.. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి, గుంటూరు జిల్లాలోని తెనాలి బ్రాంచిల్లో సోదాలు నిర్వహించారు. ఈ రెండు బ్రాంచిల్లో చందదారుల వివరాలను సేకరించారు. పలు రికార్డులను నిశితంగా పరిశీలించారు.

దసరా నాటికి గృహ ప్రవేశాలు



పసుమర్రు లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

- పసుమర్రు లేఅవుట్‌లో కనీసం 1,500 ఇళ్లు పూర్తి కావాలి
- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- వెంటనే వసతులు సమకూర్చాలి
- సీఎం ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత అందరిదీ
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- గృహ నిర్మాణాలపై ఉన్నతాధికారులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, పక్కన హౌసింగ్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ శివశంకర్

చిలకలూరిపేట: జగనన్న కాలనీల్లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లన్నీ దసరా నాటికి పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించి పూర్తిస్థాయి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా పసుమర్రు లేఅవుట్‌ను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని చెప్పారు. దసరా నాటికి పసుమర్రు లేఅవుట్‌లో 1,500 ఇళ్ల నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. అన్ని లేఅవుట్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మంచినీటి వసతి, విద్యుత్, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని సూచించారు.

అప్రోచ్ రోడ్ల అభివృద్ధి

కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ లేఅవుట్లకు అప్రోచ్ రోడ్లను వెంటనే అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాలరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, హౌసింగ్ ఈఈ బి.శివలింగం, డీఈఈ ఎస్.వెంకట్రావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు లేని పేదలంటూ ఉండరాదు

నియోజకవర్గ పరిధిలో ఇళ్లు లేని పేదలంటూ ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పేర్కొన్నారు. సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని చెప్పారు. వారికి బిల్లులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పసుమర్రు లేఅవుట్‌కు అప్రోచ్ రోడ్డును అభివృద్ధి చేయాలన్నారు. ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. వారితో మాట్లాడి వెంటనే ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు.

అన్ని విధాలా అండగా..

హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా మాట్లాడుతూ లబ్ధిదారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట అర్బన్ పరిధిలోని పసుమర్రు లేఅవుట్ రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్లలో ఒకటని వెల్లడించారు. నియోజకవర్గంలోని లేఅవుట్లు మొత్తాన్ని మోడల్ కాలనీలుగా అభివృద్ధి చేస్తామని వివరించారు.

టీడీపీ పాలనలోనే రైతుల దగా

- చంద్రబాబు, లోకేష్‌ల మాటలు నమ్మవద్దు
- రుణమాఫీ పేరుతో వంచించింది బాబే
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు



వినుకొండ(నూజెండ్ల): చంద్రబాబు, లోకేష్ తాము అధికారంలోకి వస్తే రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని అసత్య ప్రచారాలు చేస్తూ మరోసారి మోసం చేసేందుకు బూటకపు మాటలు చెబుతున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బొల్లా విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రైతులకు అనేక హామీలు ఇచ్చి నట్టేట ముంచారని, రుణమాఫీ చేస్తామని చెప్పి విడతల వారీ రైతులకు బిచ్చమేసినట్లు రూ.80 వేల కోట్లకు కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. చంద్రబాబు పాలనలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేకపోయారని, వ్యవసాయం అంటే దండగా అన్న చంద్రబాబు మళ్లీ రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని, 2014–19 వరకు రైతులకు ఏం చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 52 లక్షల మంది రైతులకు రూ.27,062 వేల కోట్లను రైతు భరోసా పేరుతో జమ చేసిందని చెప్పారు. రైతుల ఆత్మహత్యలు చంద్రబాబు హయాంలో ఎక్కువగా జరిగాయని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీ, పంట రుణాల కింద 17 లక్షల మంది రైతులకు రూ.1,834 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. పంటల బీమా కింద 18 లక్షల మంది రైతులకు రూ.6,872 కోట్లు అందించామన్నారు. 22 లక్షల మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పేరుతో రూ.1,900 కోట్లు ఇచ్చామన్నారు. టీడీపీ హయాంలో 149.56 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి ఉండగా ప్రస్తుతం 169.3 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గత ప్రభుత్వంలో రూ.వందల కోట్లు దోచుకున్నార న్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గోవిందు నాయక్, రమావత్ కృష్ణానాయక్, పారా వెంకటేశ్వర్లు, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

'శిస్తు' రక్షణ

అక్రమాలకు చెక్

- త్వరలో ఆన్‌లైన్‌లోనే పంచాయతీ పన్ను వసూళ్లు
- సర్వంసిద్ధం చేసిన అధికారులు
- 222 గ్రామాలలో బ్యాంకు ఖాతాలు ప్రారంభం
- క్యూఆర్ కోడ్, స్వైపింగ్ యంత్రాల కోసం వెయిటింగ్
- గతంలో వసూలు చేసిన సొమ్ము పక్కదారి
- పలువురు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు
- ఆన్‌లైన్ అయితే జవాబుదారీతనం
- జిల్లాలో పన్ను వసూలు మొత్తం ఏడాదికి రూ.42 కోట్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గ్రామ పంచాయతీలలో జరిగే పన్ను అక్రమాలకు చెక్ పడనుంది. పంచాయతీలలో పన్నుల వసూలు ఇకపై ఆన్‌లైన్‌లో జరిగేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్ని గ్రామ పంచాయతీలలో పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేయించారు. కొత్తగా వసూళ్ల కోసం బ్యాంక్ ఖాతాలను తెరిపించారు. బ్యాంకులలో గ్రామస్తులు చెల్లించిన పన్నులు జమ చేసేందుకు స్వైపింగ్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌ల కోసం అధికారులు వేచి చూస్తున్నారు. అవి రాగానే జిల్లాలోని 222 గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన్ ద్వారా నగదు జమ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. గతంలో ఆఫ్‌లైన్‌లో నగదు వసూళ్లు జరిగినప్పుడు పలు అక్రమాలు చోటు చేసుకునేవి.

ఇవిగో గత అనుభవాలు

- వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు కార్యదర్శి పంచాయతీ పన్నుల సొమ్ము రూ.5 లక్షలు సొంతానికి వాడుకున్నారు. మరో 20 లక్షల రూపాయల వరకు బిల్లులు లేకుండానే నగదు డ్రా చేశారు.
- పెదకాకాని మండలం నంబూరులో 2.99 కోట్ల రూపాయలు అవినీతి జరిగినట్లు లెక్క తేలడంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇద్దరు గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులను, ఇద్దరు బిల్ కలెక్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.
- చేబ్రోలు, కొల్లిపర మండలం మున్నంగి, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, దుగ్గిరాల మండలం చిలువూరు పంచాయతీలపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.
- జొన్నలగడ్డ పంచాయతీలో కూడా అవినీతి వెలుగు చూసింది. కార్యదర్శి పన్నుల వసూలులో కొత్త విధానానికి తెరలేపారు. గ్రామస్తుల వద్ద ఆస్తి పన్ను కట్టించుకున్నప్పుడు దానిపై ఉన్న మొత్తానికి, ఆఫీసులో జమ చేసిన మొత్తానికి అసలు సంబంధమే లేదు. దీని కోసం రెండు బిల్లు పుస్తకాలు వాడారు. ఒకటి పన్నుదారులకు ఇస్తే మరోటి పంచాయతీ కార్యాలయంలో లెక్కలు రాసేందుకు వాడినట్లు విచారణలో తేలింది. ఒకరి వద్ద రెండు వేల రూపాయల పన్ను కట్టించుకుని వారికి ఆ మేరకు రశీదు ఇస్తే, పంచాయతీ ఆఫీసులో మాత్రం ఐదు వందల రూపాయలు మాత్రమే జమ చేశారు.

ఈనేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిగితే, సంబంధిత అసెస్‌మెంట్‌దారుడు ఎంత పన్ను కట్టాల్సి ఉంది, ఎంత కట్టాడు, ఎంత బకాయి ఉన్నది స్వయంగా తెలుసుకునే అవకాశం ఉన్నందున అవినీతికి ఆస్కారం ఉండదు.

ఇకపై అక్రమాలు జరిగే అవకాశం లేదు

గ్రామ పంచాయతీలలో త్వరలో ఆన్‌లైన్ ద్వారా పన్నుల వసూలు కోసం అన్ని చర్యలు చేపట్టాం. ఈ విధానం అమలులోకి వస్తే అవినీతికి అవకాశం ఉండదు. ఇప్పటికే అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాం. వారు వాడుకున్నవి వసూలు చేశాం. భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు ఏ మాత్రం అవకాశం ఉండదు.

– కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

క్లుప్తంగా

యార్డులో 32,393 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,858 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 32,393 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,190 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి

వేమూరు: దేవదాయ శాఖలో ఇనాం భూములు కలిగిన వంశ పారంపర్యం పని చేస్తున్న అర్చకులు ప్రతి ఒక్కరూ వారి పేర్లు 43 రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా అర్చకుల సంఘం ప్రధానకార్యదర్శి, బాపట్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ మేడూరు శ్రీనివాసమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాని వంశ పార్యంపరం అర్చకులు జిల్లా సహాయ కమిషనర్‌కు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. రిజిస్టర్‌లో పేర్లు నమోదైతే వెల్ఫేర్ స్కీంలతోపాటు రైతు భరోసా కూడా వర్తిస్తుందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో అర్చకుల పేర్లు నమోదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఐదు లక్షల లోపు ఆలయాల నిర్వహణ లాంటి ఫలితాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. సహాయ కమిషనర్‌కు అర్జీ ఇచ్చిన వెంటనే 43 రిజిస్టర్‌లో పేర్లు నమోదు, అడంగల్‌లో చేరుస్తామన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వందశాతం పూర్తిచేయండి

సమీక్షలో జిల్లా అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



అధికారులతో సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను వందశాతం పూర్తిచేసే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి శుక్రవారం పలు ప్రభుత్వ పథకాలు కొనసాగుతున్న తీరుపై వెబ్‌ఎక్స్ ద్వారా జిల్లా, మండల అధికారులతో సమీక్ష చేశారు. ప్రధానంగా అసైన్‌మెంట్‌గా ఉన్న వ్యవసాయ అనుకూల భూములపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ సాగులో ఉన్న లంక భూముల వివరాలను సేకరించి సాగు చేసుకుంటున్న రైతులకు అర్హతను గుర్తించి యాజమాన్య హక్కులు కల్పించడంపై విచారణ చేపట్టి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఓ.టి.ఎస్, జగనన్న భుహక్కు-భూ రక్ష పథకానికి సంబంధించిన భూముల రీ సర్వే కార్యక్రమం, వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా శిస్తు వసూలు, ఓటర్ల జాబితాలో పలు అంశాలపై జరుగుతున్న సర్వే విధానం అంశాలపై చర్చించి త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని, రీ-సర్వే పనులను మరింత వేగవంతం చేయాలని, సంబంధిత శాఖల అధికారులు అంతా సమన్వయంతో ప్రభుత్వ పథకాలను సత్వరం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. డీఆర్వో కె.వినాయకం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, సివిల్ సప్లయ్ అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా మార్కెటింగ్ మేనేజర్ డి.వరలక్ష్మి, రెవెన్యూ డివిజన్ అధికారులు, ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తిచేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024 ఎన్నికలకు సంబంధించి జిల్లాలో బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వో) చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని త్వరితంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 ఎన్నికల సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ కోసం బీఎల్‌వోలు చేపట్టిన ఇంటింటి సర్వే ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన సమీక్షలో కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ శివశంకర్ లోతేటి హాజరయ్యారు.

సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ కోసం చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా తయారీ అధికారులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, ఓటర్ల జాబితా తయారీలో ఎటువంటి ఆరోపణలు తలెత్తకుండా గుర్తించబడిన రాజకీయపార్టీల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం, ఆయా నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ అధికారులు వసంతబాబు, రామచంద్రరావు, శ్రీరాములు, ఆర్డీవోలు రాజకుమారి, శేషిరెడ్డి, అద్దయ్య, తహసీల్దార్ ఆర్వీ రమణానాయక్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 20 మంది ఉద్యోగుల సమస్యలు పరిష్కారం

కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌లో జిల్లావ్యాప్తంగా 20 మంది ఉద్యోగులు హాజరై తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఉద్యోగుల సమస్యల పరిష్కార కార్యక్రమంలో ఉద్యోగులు ఇచ్చిన అన్ని సమస్యలను సావధానంగా విని సమస్యలను స్వీకరించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం డాక్టర్ కె.వినాయకం, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిందితుడు గుంటూరు జిల్లా వాసిగా గుర్తింపు



మార్టూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థం

మార్టూరు: మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మార్టూరు పోలీసు అధికారులు అరెస్టు చేశారు. సీఐ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సై కమలాకర్‌ల బృందం బెంగళూరు నుంచి గుంటూరు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సులోని ఓ ప్రయాణికుడిని అనుమానంతో అదుపులోనికి తీసుకొని విచారించారు. విచారణలో భాగంగా ఆ వ్యక్తి గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ నిజాముద్దీన్‌గా గుర్తించి అతని నుంచి 8 గ్రాముల మెథాఫిటామిన్ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గతంలో బెంగళూరులో పని చేస్తూ అక్కడి బ్రిగేడ్ రోడ్‌లోని ఓ పబ్‌లో మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. తరచూ అక్కడి నుంచి నాని అనే వ్యక్తి నుంచి మత్తు పదార్థాలు కొనుగోలు చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. స్వాధీనం చేసుకున్న 8 గ్రాముల మత్తు పదార్థాన్ని నాని నుంచి నిజాముద్దీన్ గ్రాము 1కి రూ.2 వేలు చొప్పున రూ.16 వేలకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో నిజాముద్దీన్ నుంచి 8 గ్రాముల మత్తు పదార్థంతోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అధికారులకు ఎస్పీ రివార్డు

మత్తు పదార్థాల అక్రమ రవాణాను పసిగట్టి నిందితుడిని చాకచక్యంగా అరెస్టు చేసిన మార్టూరు సీఐ, ఎస్సై కమలాకర్, ఏఎస్‌ఐలు సైదా, మహబూబ్ బాషా, కానిస్టేబుళ్లు సుబ్బారావు, ప్రసాద్‌లకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారని సీఐ తెలిపారు.

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి ఏర్పాట్లు

బాపట్ల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వార్షిక ప్రణాళికపై క్రీడాప్రాధికార సంస్థ, స్టెప్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని కలెక్టర్ చెప్పారు. అక్టోబరు రెండు నుంచి 36 రోజులపాటు క్రీడా కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖో..ఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడలను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో జరపాలన్నారు. 17 ఏళ్లు దాటిన వారికి క్రీడల్లో అవకాశం ఉంటుందన్నారు. ముందస్తుగా క్రీడాప్రాంగణాలను ఎంపిక చేసి జాబితా పంపాలన్నారు. పురుషులు, స్త్రీలు ఎంపిక కార్యక్రమాలు పారదర్శకంగా చేపట్టాలన్నారు. నియోజకవర్గస్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.50వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.30వేలు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు.

అంతర సాగుతో ఖర్చులు తక్కువ

- ప్రకృతి వ్యవసాయ విభాగం పల్నాడు జిల్లా డీపీఎం కె అమలకుమారి
- ఉన్నవ గ్రామంలోని ప్రకృతిసాగు పంటల పరిశీలన
- రైతులకు పలు సలహాలు, సూచనలు చేసిన అధికారులు



ఉన్నవలోని ప్రకృతి విధానంతో సాగైన పంటను పరిశీలిస్తున్న అధికారులు

యడ్లపాడు: అంతర పంటల సాగుతో ఖర్చులు తగ్గి..ఎర పంటలతో ఆయా పంటలకు చీడపీడల నుంచి రక్షణ ఉంటుందని ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా డీపీఎం కె అమలకుమారి తెలిపారు. మండలంలోని ఉన్నవ గ్రామంలో ప్రకృతి విధానంతో సాగు చేసిన వివిధ పంటల్ని శుక్రవారం ఆమె సందర్శించారు. స్థానిక రైతుల్ని ఆయా పంటల సాగు, చీడపీడ నివారణ, యాజమాన్య పద్ధతులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు అంతర పంటల సాగు, ఎర పంటల ఆవశ్యకతపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో రాజీలేని సూత్రాలు తప్పకుండా ఆచరించాలన్నారు. ప్రతి పంటలో అంతర పంటగా ఆరు వరుసలకు ఒక వరుస కంది వేసుకోవాలని సూచించారు. నాటిన 45 రోజులకు సార బీర వంటి తీగ జాతి కూరగాయ విత్తనాలను సాళ్లలో నాటుకోవాలన్నారు. సరిహద్దు పంటలుగా సజ్జ జొన్న మొక్కజొన్న వంటి పంటలు పొలం చుట్టూ నాలుగు వరుసలో నాటుకుంటే మేలన్నారు. ఎర పంటగా ఏడు ఆముదం మొక్కలు, 400 బంతి మొక్కలు ఎకరా పొలంలో నాటుకోవాల్సి ఉంటుందని వివరించారు. అంతర పంటలు ఎరపంటలు సరిహద్దు పంటలు వేసుకోవడం ద్వారా మిత్ర పురుగులు ఆకర్షించి శత్రు పురుగుల వ్యాప్తిని తగ్గించేందుకు దోహదపడతాయన్నారు. అంతర పంటలతో రైతుకు మంచి ఆదాయం కూడా లభిస్తుందన్నారు.

పత్తిలో సస్యరక్షణ

పత్తి విత్తన పది రోజుల తర్వాత ఎకరా పొలంలో 30 నుంచి 40 వరకు పసుపు, తెలుపు, నీలంరంగు జిగురు పూసిన అట్టలు పొలాల్లో ఏర్పాటు చేసుకుంటే రసంపీల్చే పురుగుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. నాటిన 20-30 రోజులకు ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టల్ని పెట్టుకోవాలని దీంతో గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించి నివారణ చర్యలు పొందే వీలుందన్నారు. 25 రోజుల నుంచి 30 రోజుల వ్యవధిలో ఐదుసార్లు ద్రవ జీవామృతం పారించాలని తెలిపారు. ఇలా రసాయన ఎరువుల వినియోగానికి చెక్ పెట్టి నాణ్యమైన పంట ఉత్పత్తుల్ని సాధించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ఏడీపీఎం ప్రేమరాజు, ఉన్నవ ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి పరమాత్మల కోటేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి తావులేదు

డ్వామా పీడీ శంకర్‌నాయక్



కారంచేడులో ప్రజావేదికలో పాల్గొన్న పీడీ, ఎంపీపీ, అధికారులు

కారంచేడు: గ్రామాల్లో జరిగే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడా అవినీతికి తావులేదని బాపట్ల డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వై శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన కారంచేడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సామాజిక తనిఖీ ప్రజావేదికలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది మండలంలోని 14 గ్రామాల పరిధిలో సుమారు రూ.8.32 కోట్ల నిధులతో సుమారు 618 పనులు జరిగాయన్నారు. వీటిలో పంట కాలువల నిర్మాణం, పూడిక తీతలు, కట్టలమీద మొక్కల పెంపకం, డొంకరోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టారన్నారు. వీటిలో గ్రామాల్లో జరిపిన సామాజిక తనిఖీలు, గ్రామసభల ద్వారా తనిఖీ సిబ్బందికి కొన్ని ప్రాంతాల్లో మస్టర్ రికార్డులు తప్పులు, కొట్టివేతలు గమనించామన్నారు. కొట్టివేతలుంటే ఏదో తప్పు చేసి వాటిని సరిదిద్దారనే విషయం తెలుస్తుందన్నారు. ఎక్కడా ఒక్క రూపాయి కూడా అవినీతి జరగడానికి వీలులేదన్నారు. ఒక వేళ అవినీతి, జరినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతి గ్రామం నుంచి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శోభన్‌బాబు, అంబుడ్స్ పర్సన్ బీ రత్తయ్య, ఏపీడీ రాజేష్‌బాబు, ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఏపీవో ఎన్ ప్రదీప్‌కుమార్, సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దూసుకు వచ్చిన మృత్యువు

లారీ ఢీకొని డాక్యుమెంట్ రైటర్ దుర్మరణం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు దూసుకువచ్చి డాక్యుమెంట్ రైటర్ దుర్మరణం చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామానికి చెందిన మున్నంగి సాయిరామ్ (35) డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. గ్రామంలోనే గాక సత్తెనపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో వివిధ రుణాలు ఇప్పిస్తుంటాడు. దీనిలో భాగంగా పట్టణంలో కార్యాలయం ఏర్పాటు చేసుకొని నిత్యం సత్తెనపల్లికి వచ్చి వెళుతుంటాడు. గురువారం రాత్రి తన పనులు ముగియగానే ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అదే సమయంలో మోర్జంపాడు నుంచి పెద్దాపురానికి నూగులు లోడు లారీ వెళ్తుంది. సాయిరామ్ రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు పైకి ద్విచక్రవాహనం చేరుకున్న సమయంలో లోడు లారీ వెనుక టైర్ బలంగా తగిలి కొంత దూరం ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకు వెళ్లింది. సాయిరామ్ రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గ్రావెల్ తవ్వకాలను వ్యతిరేకించిన గ్రామస్తులు



తవ్వకాలకు వ్యతిరేకంగా చేతులెత్తి తమ అభిప్రాయాలను తెలుపుతున్న గ్రామస్తులు

మార్టూరు: తమ గ్రామంలో గ్రావెల్ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేది లేదని మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామస్తులు బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు తెలిపారు. రెవెన్యూ అధికారులు, రెండు గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కే రజనీష్‌రెడ్డి బొబ్బేపల్లి కొండ సర్వే నంబర్ 387/సీ11లో గ్రావెల్ త్రవ్వకాల కోసం అనుమతించాల్సిందిగా మైనింగ్, పర్యావరణ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో జేసీ, ఆర్డీఓ గంధం రవీందర్‌లు శుక్రవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలో చాటింపు వేయించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సమావేశానికి హాజరైన గ్రామస్తులతో జేసీ శ్రీధర్ మాట్లాడుతూ కొండపై గ్రావెల్ తవ్వకాలను వ్యతిరేకించే వారు చేతులు ఎత్తడం ద్వారా తమ అభిప్రాయాలను తెలుపమని కోరారు. ప్రజలంతా చేతులెత్తి తమ వ్యతిరేకతను తెలియజేశారు. గ్రావెల్ తవ్వకాలకు అనుకూలురు ఉంటే తమ ఆమోదం తెలుపమని జేసీ అడుగగా ఒక్కరు కూడా చేతులెత్తకపోవడం గమనార్హం. ఈ క్రమంలో జేసీ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని రికార్డు చేశామని నివేదికను ఉన్నతాధికారులకు, పర్యావరణ పరిరక్షణ అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఆర్ఐ బాషా, ఎంపీటీసీ సభ్యులు దండా హరిబాబు, మాజీ సర్పంచ్ దండా వీరాంజనేయులు, తాళ్లూరి కోటేశ్వరరావు, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి ఆత్మహత్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: క్షణికావేశంలో భార్యను చంపి, తన బిడ్డలను దిక్కులేని వారిని చేశానని మనస్థాపంతో ఒక వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో జరిగింది. రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు తెలిపిన వివరాలు ప్రకారం. రామకూరు గ్రామానికి చెందిన పావులూరి లక్ష్మీనారాయణ (34) కుటుంబ కలహాల నేపథ్యంలో తన భార్య నాగసునీతను ఐదు నెలల కిందట గొంతు నులిమి హత్య చేశాడు. తన భార్యను చంపిన హత్య కేసులో సుమారు మూడు నెలలపాటు రిమాండ్‌లో ఉండి ఇటీవల బయటకు వచ్చాడు. పిల్లలను తన వద్ద ఉంచుకొని వలపర్లలో హెయిర్ స్టైల్ కటింగ్ షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. క్షణికావేశంలో తన భార్యను హత్యచేశానని, పిల్లలను చూసుకోవటం చాలా ఇబ్బందిగా ఉందని పలుమార్లు కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన చెందినట్లు ఎస్సై తెలిపారు. క్షణికావేశంలో భార్యను చంపి పిల్లల ఆలనా పాలనా చూసుకోవటం బాగా ఇబ్బందిగా ఉండటంతోపాటు, పదేపదే భార్య గుర్తొస్తుండటంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం తన ఇద్దరి కుమారులను బంధువుల వద్ద వదిలి పెట్టి ఇంటికి వచ్చాడు. గురువారం రాత్రి రామకూర్‌లోని తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి ఇంటిలో ఉన్న మృతుడు లక్ష్మీనారాయణ శుక్రవారం మధ్యాహ్నం కూడా ఇంటి తలుపు వేసి ఉండే సరికి అనుమానం వచ్చిన చుట్టుపక్కల వాళ్లు కిటికీలో నుంచి లోపలికి చేశారు. ఉరివేసుకొని మృతి చెందాడని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు లక్ష్మీనారాయణకు తొమ్మిది సంవత్సరాల అభిరామ్, ఏడు సంవత్సరాల విజయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కచ్చితమైన పంట నమోదు చేయండి

గుంటూరు జిల్లా జేసీ జి.రాజకుమారి

గుంటూరువెస్ట్: ఈ-క్రాప్ నమోదు సమయంలో రైతు వేసే పంటను కచ్చితంగా నమోదు చేస్తే విక్రయించేటప్పుడు ఇబ్బందులుండవని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక డీఆర్సీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ ఇప్పటి వరకు 4760 ఎకరాలు ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదైందన్నారు. దీనికోసం జియో కో-ఆర్డినేట్స్‌లో పంట ఫొటోలు తీయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన 36,644 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేశామన్నారు. వీరిలో 2389 మందికి రూ.15.36 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. రైతుల కోరిక మేరకు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ద్వారా జింక్ సల్ఫేట్ 21 శాతాన్ని సరఫరా కోసం టెండర్లు పిలిచామన్నారు. గ్రామాల్లో పొలాల్లోకి వెళ్లే మార్గంలో డొంక రోడ్డుల నిర్మాణాలు, మరమ్మతులకు ఏపీ మార్కెటింగ్ శాఖ ద్వారా అభ్యర్థనను పంపించాలని చెప్పారు. పంట కాలువల్లో, డ్రెయి నేజీ కాలువల్లో పూడికతీత పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎస్.శివరామకృష్ణ మాట్లాడుతూ జింక్ సల్ఫేట్ 21 శాతం టెండర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు ఆర్థికంగా పురోగమించేందుకు తగిన సాయం అందిస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

2003 ముందు అసైన్డ్ చేసిన వ్యవసాయ భూములు, ఇనాం భూములు, 10 సంవత్సరాల క్రితం అసైన్‌మెంట్ చేసిన నివేశన స్థలాలు క్రమబద్ధీకరించేటప్పుడు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని జేసీ జి.రాజకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక డీఆర్సీ సమావేశ మందిరంలో అధికారుల సమావేశం నిర్వహించారు.